సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



కస్సు'బస్సు'లకు టాటా..!

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని సూచిస్తున్నారు.

- 8లో



కుమార్తె మృతితో తండ్రి ఆత్మహత్య

నరసన్నపేటలో విషాదం చోటుచేసుకుంది. కుమార్తె మృతి తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు.

- 8లో

నేటి నుంచి శ్రీకూర్మంలో ధర్మప్రచార వారోత్సవాలు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయంలో ఆదివారం నుంచి ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో జి.గురునాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నగర సంకీర్తనతో వారోత్సవాలు ప్రారంభమవుతాయని అనంతరం గోపూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

న్యూస్‌రీల్

21న ప్రత్యేక లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: మోటార్ ప్రమాద కేసులు, రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న కేసుల రాజీ కోసం ప్రత్యేకంగా ఈ నెల 21న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శనివారం జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో ఇన్సూరెన్స్ అధికారులు, ఆర్టీసీ, మోటార్ ప్రమాద కేసులో పిటిషనర్ అడ్వకేట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ రెవెన్యూ అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల రాజీ వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి గణపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, మంచు జనార్దనరావు, ఎస్.రాజేశ్వరరావు, జీవరత్నం వెంకటరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదరికం తగ్గింపుపై సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళిక (విలేజ్ పావర్టీ రిడక్షన్ ప్లాన్)పై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళికపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేందుకు కమ్యూనిటీ ఆధారిత సంస్థలను, వాటి నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్నారు. అన్ని శాఖల వారు గ్రామస్థాయి సిబ్బందికి ప్రణాళికపై సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయాలన్నారు. జీవనోపాధి, సేవలు, వనరులు, సామాజిక అభివృద్ధి ఆధారంగా సర్వే జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే బాగా నిర్వహిస్తే గ్రామీణ ప్రాంతాలకు వసతులు సమకూరుతాయని చెప్పారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మీనా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డి.వి.విద్యాసాగర్, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ఫిషరీస్ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఇరిగేషన్ ఈఈ పొన్నాడ సుధాకర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

సరుబుజ్జిలి: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే దర్యాప్తు చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సిబ్బందిని ఆదేశించారు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. నాన్‌బెయిల్‌బుల్ వారెంట్స్ అమలు చేసి ముద్దాయిలను కోర్టులో హాజరుపరచాలని ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్‌ను ఆదేశించారు. సైబర్‌నేరాలు, మహిళలపై అకృత్యాల అడ్డుకట్టకు జాగృతి బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



దున్నేవాడిదే భూమి..



జగన్ సంస్కరణల సునామీ

- గత ప్రభుత్వాలు చేయని పనుల్ని సాహసోపేతంగా చేస్తున్న సీఎం జగన్
- భూమి నిరుపయోగంగా ఉండకూడదనేదే ప్రభుత్వ లక్ష్యం
- సంస్కరణల వేళ విమర్శలు సర్వసాధారణం
- తప్పచేస్తే వదిలేసే అధికారం ప్రభుత్వాలకు ఉండదు
- న్యాయస్థానంలో చంద్రబాబు నిజాయితీ రుజువు చేసుకోవాలి
- కుంభకోణాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టీకరణ



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'భూములు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి రాష్ట్రంలో పేదలను ధనవంతుల సరసన నిలబెట్టాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ప్రజలందరికీ సమాజంలో స్టేటస్ పెంచాలన్న ధ్యేయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోంది. 20 ఏళ్ల సాగులో ఉండే వ్యక్తికి ఆ భూమిపై సర్వహక్కులు కల్పిస్తోంది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పేద ప్రజల స్థితిగతులు అర్థం చేసుకుని సీఎం జగన్ ధైర్యంగా ముందుకెళ్తున్నారు. అందులో భాగంగానే అనేక భూ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. వీటిని చూసి ఓర్వలేక విపక్షాలు తొలుత దుష్ప్రచారం చేశాయి. ఆర్డినెన్స్ తెచ్చాక, అసెంబ్లీలో చట్టం చేశాక విమర్శలు చేసేవారంతా నోరు మెదపకుండా ముక్కున వేలేసుకున్నారు..' అని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై శనివారం ఆయన 'సాక్షి'తో ముచ్చటించారు. ఏం చెప్పారన్నది ఆయన మాటల్లోనే...

సంస్కరించే వాడే పాలకుడు..

ప్రజల కష్టాలను తగ్గించి, జీవన ప్రమాణాలు పెంచి, వారి గుండెల్లో చిరకాలం ఉండే వాడే గొప్ప నాయకుడవుతారు. అన్ని వైపులా వస్తున్న దాడిని తట్టుకుని సంస్కరణలు చేయగలిగిన వాడే మంచి పాలకుడు. అలాంటి నాయకుడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. స్వాతంత్ర్యం వచ్చే సమయానికి పేదలకు భూమి ఇస్తే అది మళ్లీ ధనవంతుల దగ్గరకు చేరిపోయే పరిస్థితి ఉందని, అందుకే పేదలకిచ్చిన భూముల్ని అమ్మకూడదని, వ్యవసాయం మాత్రమే చేయాలని అప్పట్లో నిబంధన పెట్టారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేనందున.. ఇంకా భూమిని ప్రభుత్వం చేతుల్లో పెట్టుకోవడం సరికాదు. ఆ భూములపై సర్వ హక్కులు ఇవ్వాల్సిందేనని సీఎం జగన్ భావించారు.

నిరుపయోగంగా భూములు..

భూమిని ప్రజల వద్దకు చేర్చడం ఈ ప్రభుత్వం ఫిలాసఫీ. లిటిగేషన్ ఫ్రీ, టైటిల్‌ఫ్రీతో వినియోగంలోకి తేవాలి. దాని వల్ల పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలి. పరిశ్రమలు, ఇతరత్రా అవసరాలకు భూమిని వాడుకునేందుకు లిటికేషన్ ఫ్రీ ఉండాలి. ఇదంతా భూమి పాలసీ. స్వాతంత్ర్యనంతరం రాజ్యాంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో పాల్గొన్న ప్రతినిధులంతా భూ వినియోగాన్ని పెంచాలని, భూమిని ప్రజలకు చేర్చి ఉత్పత్తులు పెంచాలని, తద్వారా జీవన ప్రమాణాలను పెంచాలని సూచించారు. భూ సంస్కరణలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనివి. కొన్ని రాష్ట్రాలు దానిపై దృష్టి సారించలేదు. కొన్ని రాష్ట్రాలకు భూమే లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 75 ఏళ్లలో వచ్చిన ప్రభుత్వాలన్నీ చేశాయి. 70 లక్షల ఎకరాల భూమిని ప్రజలకు అందించాయి. దీంతో జమిందార్లు, కింగ్స్, ఎస్టేట్‌దారులంతా పోయి సామాన్యుల చేతికి భూములు చేరాయి. అయితే, ఆ భూములు వ్యవసాయానికి తప్ప ఇతర కార్యక్రమాలు చేసేందుకు వీలులేకుండా చేశారు. దీంతో కొన్నిచోట్ల భూమి ఇరుక్కుపోయింది.

ప్రజల వద్దకు పాలన..



గత ప్రభుత్వాలన్నీ ప్రజల వద్దకే పాలన అని మాటలకే పరిమితమయ్యారు. ఇప్పుడు చేసి చూపించాం వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల ఇళ్లకే సేవలు అందిస్తున్నాం. నయాపైసా ఇవ్వకుండానే పనులన్నీ జరుగుతున్నాయి. 90 శాతం పైగా అవినీతి దూరమైంది.

సాహసోపేత నిర్ణయం



భూమి టైటిల్ ఫ్రీగా ఉంటే పెట్టుబడులు తెస్తుంది. దానివల్ల ఉద్యోగాలు వస్తాయి. జీడీపీ పెరిగి రాష్ట్రం వృద్ధిలోకి వస్తుంది. ఇటువంటి దాన్ని ప్రక్షాళన చేసేందుకు ఎవరూ ధైర్యం చేయలేదు. సీఎం జగన్ ఒక్కరే సాహోసోపేతమైన అడుగులు వేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కమిటీ వేయడం, అధ్యయనం చేయడం, మిగతా రాష్ట్రాల్లో ఏం చేశారు.. తెలుసుకోవడం వంటి సమగ్ర విశ్లేషణ తర్వాత అసైన్డ్ భూముల చట్ట సవరణ చేశారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా 15 లక్షల కుటుంబాలకు మేలు జరుగుతోంది. 28 లక్షల ఎకరాల భూమిపై ఒకేసారి యాజమాన్య హక్కులు వస్తున్నాయి. ఇంత పెద్ద సమస్యకు ఒక్క ఆర్డినెన్స్ ద్వారా పరిష్కారం చూపాం. అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు దాటితే యాజమాన్య హక్కులు పూర్తిగా లభిస్తాయి. దీనివల్ల ప్రభుత్వానికి భూమి లభ్యత పెరుగుతోంది. పెట్టుబడులు వచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. భూమి వినియోగంలోకి తీసుకురాకపోతే అది సరైన పాలన కాదన్నది మా ప్రభుత్వం అభిప్రాయం.

సర్వీస్, ఇనామ్, షరతుల పట్టాలకు మేలు..

పూర్వం గ్రామాల్లో ప్రజలకు కులపరంగా చేసే వృత్తిని బట్టి సర్వీస్ ఇనామ్ కింద బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, చాకలి, పల్లకి మోసేవారికి భూములిచ్చేవారు. వాటిని సైతం అలా వదిలేశారు. అంతేకాకుండా ఏక్‌సాల్, షరతుల పట్టాల భూముల సైతం లాక్‌అయిపోయాయి. అటువంటి అన్ని రకాల పట్టాలను ఈ ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టింది. దీంతో టైటిల్ ఫ్రీల్యాండ్ భూమిని సక్రమంగా వినియోగించుకుని, దాని ద్వారా లావాదేవీలు జరుపుకుని, జీడీపీ(తలసరి) ఆదాయం పెరిగేందుకు చర్యలు తీసుకున్నారు.

గ్రామంలోనే రిజిస్ట్రేషన్.. అరగంటలో మ్యుటేషన్



రిజిస్ట్రేషన్ జరిగిన అరగంటలో మ్యుటేషన్ ఇచ్చేలా సాంకేతిక అవకాశాలు కల్పించారు. భూమికి సంబంధించిన అన్నివివరాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకునేలా మ్యాప్ తయారు చేశారు. లాంగిట్యూడ్, లాటిట్యూడ్, క్యూఆర్ కోడ్‌లను సైతం ఏర్పాటుచేసి భూ వివరాలు తెలుసుకునేలా చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంటల కొద్దీ వేచి ఉండకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించింది ఈ ప్రభుత్వం.


వైఎస్సార్ తర్వాత మళ్లీ భూపంపిణీ..

ఇళ్లు లేని నిరుపేదలకు రాష్ట్రంలో 30 లక్షల పట్టాలిచ్చారు. వాటిలో ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తోంది. వైఎస్సార్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో 7లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేశారు.



ఇప్పుడు మళ్లీ సాగుకు యోగ్యమైన భూమిని గుర్తించి, అర్హులైన నిరుపేదలకు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. అసైన్డు భూముల చట్టంలో ఇళ్ల స్థలాలపై ఉన్న ఆటంకాన్ని కూడా ముఖ్యమంత్రి ఎత్తివేశారు. 10 ఏళ్ల తర్వాత ఆ స్థలాలను అమ్ముకునే అవకాశం కల్పించారు వైఎస్ జగన్.

చుక్కల భూములకు పరిష్కారం..



1880 నుంచి 1926 మధ్యలో భూముల సర్వే జరిగింది. తర్వాత రెండు దశాబ్దాల పాటు సర్వే చేయకుండా అప్పటి నుంచి ఆ రికార్డులే ఇప్పటివరకు కొనసాగుతున్నాయి. అందులో చుక్కలు భూములుగా గుర్తించినవి అలానే ఉన్నాయి. బ్రిటీష్ కాలం నుంచి శిస్తు ఆధారంగానే భూ యజమానులుగా గుర్తిస్తున్నారు. పంట పండినా పండకపోయినా శిస్తు వసూలు చేసిన పరిస్థితి ఉండేది. దాని ఆధారంగా భూయజమానులుగా గుర్తించేవారు. శిస్తు కట్టలేక చాలా మంది భూయజమానులుగా గుర్తింపు లేకుండా ఉండేలా చేసుకున్నారు. అలాగే ప్రభుత్వం ఆహారపు దినుసులు కొరత పేరిట పండించిన పంటను ప్రభుత్వమే తీసుకెళ్లిపోయిన పరిస్థితి ఉండేది. భూమి అవసరానికి ఉపయోగపడదని, దానివల్ల డబ్బులు రావని అనుకున్నవారంతా భూవివరాలు నమోదు చేసుకునేవారు కాదు. కొంతమంది అమాయకత్వం వల్ల భూములను వదిలేశారు. అలాంటి భూములకు రికార్డుల్లో చుక్కలు పెట్టేశారు. అవన్నీ నిషేధిత భూములుగా ఉండిపోయాయి. ఇటువంటి భూములకు సైతం సర్వ హక్కులు కల్పించి ప్రభుత్వం వాడుకలోకి తీసుకొచ్చే పనిచేసింది. 3 నుంచి 4 లక్షల ఎకరాల చుక్కలు భూముల్ని ఒక్క జీవోతో వాడుకలోకి తీసుకొచ్చాం. 12 ఏళ్లు సాగుచేస్తే ఆ భూమిపై సాగుహక్కును కల్పించాం.

తప్పచేస్తే జైలు తప్పదు..

కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు అన్ని రకాల ఇన్వెస్టిగేషన్స్ చేసి నిర్ధారణ అయిన తర్వాతే స్కిల్‌స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ, ఇన్‌కంట్యాక్స్ వంటి కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ముందే విచారణ చేశాయి. బాబు అరెస్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. ఎన్ని మ్యానిప్లేషన్స్ తెలిసినా తప్పుచేసేవారు ఎప్పుడో ఒకప్పుడు దొరికిపోకతప్పదు. చంద్రబాబు అపార అనుభవం మంచికి వాడాలే తప్ప ప్రజాధనాన్ని లూటీచేయడానికి కాదు. తప్పుచేసింది, చేయలేదనేది కోర్టు తేల్చాలి. టీడీపీ నేతలు టెక్నికల్ పాయింట్లపై మాట్లాడుతున్నారే తప్ప స్కామ్ చేయలేదని చెప్పడం లేదు. రాజకీయ లబ్ధి కోసం టీడీపీ నేతలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నా ప్రజలెవ్వరు మద్దతివ్వడం లేదు. బాబు అరెస్ట్‌ని తప్పుపట్టడం లేదు. సీమెన్స్ జర్మనీ కంపెనీ లావాదేవీలు అడిగితే అఫిడవిట్‌తో సహా మా కంపెనీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. బోగస్ కంపెనీతో ఒప్పందాలు చేసుకుని, ప్రభుత్వ ధనాన్ని కట్టబెట్టి, అక్కడి నుంచి షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు, లోకేష్‌ల వ్యక్తిగత సహాయకుల ఖాతాల్లోకి మళ్లినట్టు విచారణ సంస్థలు తేల్చాయి. ఏ తప్పూ చేయకపోతే ఆ ఇద్దరు విదేశాలకు ఎందుకు పరారయ్యారో చెప్పాలి. ఇన్వెస్టిగేషన్‌కు సహకరిస్తే నిజానిజాలు తేలుతాయి. ఎన్నికల ముందు సానుభూతి పొందాలన్న ప్రయత్నం వర్కౌట్ కాదు. తప్పించుకోవడంలో సమర్థత ఉన్నా ప్రజాకోర్టులో ఓడిపోక తప్పదు.

విద్యలో మార్పులు ఓట్ల కోసం కాదు..



విద్యారంగంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త సిలబస్‌లు, టీచింగ్ మెథడ్స్ తీసుకొచ్చి స్కూళ్లను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. మరో 20 ఏళ్లు పాటు ఈ విధానాలు రాష్ట్రంలో అమలుచేస్తే ఓ కొత్త జనరేషన్ ఏర్పాటవుతుంది. అన్ని రాష్ట్రాల్లో కంటే విద్యలో ప్రథమస్థానంలో ఉంచేందుకు నేటి విద్యావిధానం పనికొస్తుంది. ఇవేవీ ఓట్లు ఆశించి చేసిన పనులు కాదు. 5 ఏళ్ల పిల్లలకు ఓటుహక్కు కూడా ఉండదు. భావితరాలను తయారుచేసే దిశగా విశాల భావజాలంతో ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వాలు కఠినంగా కనిపిస్తాయి. విమర్శలకు గురవుతాయి. దానికి భయపడకుండా సీఎం జగన్ విద్యా విధానంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. ఇవి 20 ఏళ్లు కొనసాగితే అద్భుత ఫలితాలు వస్తాయి.

● వాసుదేవ వైభవం



సర్వంతర్యామి వాసుదేవుడి దివ్యరూపం భక్తులకు కనువిందు చేసింది. మందస పట్టణంలోని వాసుదేవ పెరుమాళ్ స్వామిని శనివారం ఏడుకొండల వేంకటేశ్వరునిగా అలంకరించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

– మందస

నృత్య ప్రదర్శన



కళాకారుల నృత్య ప్రదర్శన

అరసవల్లి: ధర్మ ప్రచార వారోత్సవాలలో భాగంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శ్రీఅభినయ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో డాక్టర్ నీరజ నేతృత్వంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. త్రిచసౌర అరుణ ప్రయుక్త సూర్యనమస్కారాలు, గోపూజ, వేదపండిత పారాయణ, పీసపాటి అప్పల సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో గీతమండలి సభ్యులతో సంపూర్ణ భగవద్గీత పారాయణ, ఆలయ వాయిద్య కళాకారుల బృందంతో నాదస్వర కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్(రాజా) ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం టౌన్ హాల్ వేదికగా ఉదయం 9 గంటల నుంచి జిల్లాస్థాయి అండర్–23, సీనియర్స్ పురుషులు, మహిళల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 14, 15 తేదీల్లో కాకినాడలో జరగనున్న 10వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్, 7వ రాష్ట్రస్థాయి యూత్(అండర్–23) పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు 7660874844, 8897567779 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వారంలోగా పీజీ రీవాల్యుయేషన్ ఫలితాలు



డయల్ యువర్ యూనివర్సిటీలో పాల్గొన్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వారం రోజుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ నిర్వహించారు. ఫోన్ ఇన్ లైవ్‌లో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పీజీ మొదటి, మూడు సెమిస్టర్ల రీవాల్యుయేషన్ చివరి దశలో ఉందన్నారు. ఇయర్ ఎండ్ డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఈ ఏడాది నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. డిగ్రీ 4, 6 సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలు మూడు వారాల్లో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, చింతాడ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పీకర్‌ను కలిసిన మండలి విప్



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న విప్ విక్రాంత్

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ శాసన మండలి విప్‌గా ఇటీవల నియమితులైన పాలవలస విక్రాంత్ శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలస క్యాంపు కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ క్రియాశీలకంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

ఫ్రీజర్ బాక్సులకు రూ.లక్ష విరాళం



చెక్కును అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ రెండు శీతలీకరణ శవపేటికలు (ఫ్రీజర్ బాక్సులు) కొనుగోలు చేసేందుకు శనివారం త్రిపురాన రామకృష్ణ, నీలవేణి, ఇందిర సౌజన్యంతో చిక్కాల సుభాషిణి (రిటైర్డ్ తహసీల్దారు) రూ.1,04,000 సాయాన్ని అందించారు. అలాగే నిత్యాన్నదానం కోసం రూ.5వేల విలువైన చెక్కును విశ్రాంత జాయింట్ కలెక్టర్ ఆర్.రజనీకాంతరావు చేతుల మీదుగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బి.చిన్మయరావు, మల్లా కల్యాణచక్రవర్తి, నిక్కు హరిసత్యనారాయణ పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఇంటర్ సర్టిఫికెట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంబంధించి ఒరిజినల్ మార్క్స్ మెమోలు/పాస్ సర్టిఫికెట్లు జిల్లాకు చేరుకున్నాయి. వీటిని త్వరితగతిన విద్యార్థులకు అందజేసేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు/ప్రతినిధులు ఇంటర్ మార్క్ మెమోలను ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లాలని ఆర్‌ఐఓ పి.దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న ధర్మారావు కుటుంబ సభ్యులు

టెక్కలి రూరల్: స్థానిక కండ్ర వీధికి చెందిన నాగుల ధర్మారావు(31) మృతికి కారకులైన వారిని శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 4న మద్యం అధికంగా సేవించడంతో ధర్మారావు మృతిచెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారని, వాస్తవంగా అతనితో కలిసి వెళ్లిన వారే చంపి ఉంటారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ శిబిరం వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి ఇళ్లకు పంపించారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ ఎంపికలు



వివిధ క్రీడల్లో ఎంపికైన బాలికలు

టెక్కలి: అండర్ –19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు శనివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉల్లాసంగా జరిగాయి. స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎస్.రమణ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ తదితర క్రీడల్లో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.నారాయణరావు, కబడ్డీ జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, పీడీలు చరణ్, ఎస్.రమేష్, కె.కె.రామిరెడ్డి, కె.ప్రకాశ్, లక్ష్మణరావు, రాజా, వై.వెంకటరమణ, ఆదిశేషు, కె.రఘునాథరావు తదితరులు పర్యవేక్షించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పొందూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం షాలీమర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించాడని, వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీ నంబర్ 70132 73731కి తెలియజేయాలని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

కస్సుబస్సులకు టాటా..!

- ప్రయాణికుల పట్ల మరింత మర్యాద
- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సిలింగ్
- వారంలో ఒకరోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో నిర్వహణ
- ప్రైవేటు వాహనాలవైపు ప్రయాణికులు చూడకుండా చర్యలు



ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్ : ఆర్టీసీ బస్సుల్లో కొందరు కండక్టర్లు, డ్రైవర్ల ప్రవర్తనపై తరచూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పని ఒత్తిడి, ఇతర కారణాలు ఏవైతేనేం ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంబోధిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, సరిగ్గా సమాధానం ఇవ్వడం లేదంటూ ఆర్టీసీ ఫిర్యాదుల విభాగానికి కంప్లైంట్స్ అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల పట్ల ఆర్టీసీ సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ప్రయాణికుల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు

ఫిర్యాదులపై సీరియస్..

ప్రయాణికులు ఆపమన్నచోట బస్సు ఆపాలని, బస్సు ఎక్కేందుకు చేయి ఎత్తినచోట బస్సును నిలపాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు కండక్టర్లకు, డ్రైవర్లకు సభలు, సమావేశాలు నిర్వహించిన ప్రతిసారీ చెబుతున్నప్పటికీ ఫలితం ఉండటం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. కొన్ని సందర్భాలలో టికెట్ ఇచ్చే సమయంలో చిల్లర సమస్య ఏర్పడి ప్రయాణికులతో వాదనలు పెట్టుకుంటున్నారని అధికంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. దీనిపై కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సిలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది.

విజయనగరంలో కౌన్సిలింగ్..

ఆర్టీసీ జోన్–1కు సంబంధించి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలోని ఆర్టీసీ డిపోలలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్‌లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కళాశాలలో కౌన్సిలింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటలు చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి వచ్చిన నిపుణులు, అధ్యాపకులు, అడ్వకేట్లను రప్పించి సహృద్భావ వాతావరణంలో కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నారు.

ఓఆర్ పెరిగే అవకాశం:

ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాటతీరు గౌరవ ప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంబోధించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. కౌన్సిలింగ్ మేరకు సిబ్బంది మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, తద్వారా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పెరిగి సంస్థ ఆదాయం సమకూరేందుకు అవకాశం ఉంటుందని, ప్రయివేటు ఆపరేటర్లవైపు మరలే అవకాశం ఉండదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

మర్యాదతో మెలిగేలా..



ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించేలా చూస్తాం. తద్వారా ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. ఆక్యుపెన్సీ రేషియో పెరిగి సంస్థ ఆదాయం వృద్ధి చెందుతుంది. ఫిర్యాదుల విభాగానికి వచ్చిన కంప్లైంట్లు ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 15 నుంచి 20 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నాం.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీవో

ఓపికతో వ్యవహరించాలి..



సిబ్బంది దురుసుగా ప్రవర్తించే విధానానికి స్వస్తి పలికేలా చూస్తాం. ప్రయాణికులతో ఓపికగా మాట్లాడి వారి మన్ననలు పొందేలా నిపుణులు శిక్షణ తరగతులు ఇస్తారు. తద్వారా ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం కొనసాగించేలా చూస్తాం.

– కె.ఆర్.ఎస్.శర్మ, ఆర్టీసీ రెండో డిపో మేనేజర్

జీవన ప్రమాణాల పెంపుదలకు కృషి



డీసీసీబీ కాలనీలో అర్బన్‌హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- డీసీసీబీ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో డీసీసీబీ కాలనీలో రూ.1.8 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. చిల్డ్రన్ పార్కుకు రూ.15 లక్షలు, రోడ్డు ఎత్తుకు రూ.20 లక్షలు, రోడ్డు విస్తరణకు రూ.22 లక్షలు, బ్యూటీ పార్లర్ రోడ్డుకు రూ.20 లక్షలు కేటాయించామని, ఈ పనులన్నీ ఎన్నికల ముందే పూర్తి చేస్తామన్నారు. ప్రాథమిక చికిత్సకు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశామని, వైద్య రంగానికి సంబంధించి బడ్జెట్లో పెద్ద ఎత్తున కేటాయింపులు చేశామని చెప్పారు. సాధారణ కుటుంబాలు వైద్యం కోసం అప్పుల పాలవ్వకుండా ప్రభుత్వం తోడుగా ఉంటోందన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు ప్రభుత్వం అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తోందన్నారు. పరిపాలనను వార్డు, గ్రామ స్థాయికి తీసుకువచ్చామని, రిజిస్ట్రేషన్లు కూడా గ్రామ సచివాలయంలోనే జరుగుతాయని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో కేఆర్ స్టేడియం నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరయ్యాయని, పనులు పూర్తి చేసి త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మెంటాడ పద్మావతి, సాదు వైకుంఠరావు, బలగ గణపతి పట్నాయక్, హెల్త్ సెంటర్ చైర్మన్ రాజేంద్ర కుమార్, హారిక ప్రసాద్, అల్లు లక్ష్మీ నారాయణ, డాక్టర్ పైడి మహేశ్వరరావు, కొండల గణేష్, ఉన్న నాగరాజు, తెలుగు రమేష్, బరాటం సంతోష్, రుప్ప శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు కృతజ్ఞతాభినందన సమావేశం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాకే తలమానికమైన కోడిరామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణ పనులకు రూ.12 కోట్లు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి క్రీడాకారులు, జిల్లా ప్రజలు కృతజ్ఞతాభినందలు తెలిపేందుకు ఆదివారం ఉదయం 6.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రీడాకారులు, వాకర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు శిమ్మ రాజశేఖర్, సుంకరి కృష్ణ, ఎం.ఎ స్.ఆర్, ఊన్న నాగరాజు, కాపవరపు సీజు, అర్జి ఈశ్వరరావు తదితరులు కోరారు.

టీడీపీని నమ్మితే అధోగతే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- జేసీఎస్ సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

నరసన్నపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా పాలన చేస్తూ ప్రజలందరికీ మేలు చేస్తున్నారని, ఇటువంటి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీ అందరిపైనా ఉందని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టీడీపీని నమ్మితే అధోగతేనని అన్నారు. నరసన్నపేట టౌన్ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు ముఖ్యమంత్రిగా ఉండాలి అనే కార్యక్రమంపై మాట్లాడారు. భవిష్యత్తు గ్యారెంటీ అనే నినాదంతో ప్రజల వద్దకు వస్తున్న టీడీపీ, జనసేనల భవిష్యత్తుకే గ్యారంటీ లేదన్నారు. వారి కుయుక్తులను నమ్మవద్దని కోరారు. ఇప్పటి నుంచే సమష్టిగా పనిచేయాలని సూచించారు. శాసన మండలిలో విప్‌గా ఎన్నికైన పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ నరసన్నపేటలో దాసన్న ఎమ్మెల్యే అయితే మన జగనన్న అక్కడ సీఎం అవుతారని, దీనిని దృష్టిలో పెట్టుకొని అందరూ పనిచేయాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మళ్లీ మీకు అందాలంటే జగనన్నను, కృష్ణదాస్‌ను మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ నరసన్నపేట టౌన్‌ను మండలంగా మేము భావించి నిధులు కేటాయిస్తున్నామని, అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, ముద్దాడ బాలభూపాలనాయుడు, బార్ల వేణుగోపాలరావు, సురంగి నర్సింగరావు, పొట్నూరు సాయిప్రసాద్, సదాశివుని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె మృతితో తండ్రి ఆత్మహత్య

- స్వచ్ఛందంగా బంద్ పాటించిన వర్తకులు
- నవ్య భర్త, అత్తలను కఠిన శిక్షించాలని డిమాండ్
- నరసన్నపేటలో ర్యాలీ నిర్వహించిన మహిళలు



మృతుడు గోవిందరావు



వైఎస్సార్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించిన మహిళలు

నరసన్నపేట: అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె (నవ్య) అత్తింటి వేధింపులకు బలికావడాన్ని తట్టుకోలేకపోయిన తండ్రి నారంశెట్టి గోవిందరావు(56) శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. వాకింగ్ కోసం ఇంటి నుంచి ఉదయం 6 గంటలకు బయటకు వెళ్లిన ఆయన సత్యవరం కూడలిలో చెరువులో మునిగి బలవన్మరణం చెందాడు. దీంతో నరసన్నపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇదే ప్రాంతానికి చెందిన పాడుగు నవ్య(26) బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం విదితమే. కుమార్తె మరణించినప్పటి నుంచీ విషాదంలో ఉన్న గోవిందరావుకు నవ్య భర్త, వారి కుటుంబ సభ్యులు సూటిపోటు మాటలాడటంతో మరింతగా కుంగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమార్తె మృతి చెందిన దుఃఖం తీరక ముందే భర్త కూడా మరణించడంతో గోవిందరావు భార్య లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానిక జోగిపేటకు చెందిన గోవిందరావు తన కుమార్తె నవ్యకు పాడుగు సంతోష్‌కిచ్చి 2019లో వివాహం చేశారు. అత్తింటి వేధింపులకు తట్టుకోలేక కుమార్తె చనిపోవడం, పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేయకపోవడం, ఇప్పటికీ వారిని అరెస్టు చేయకపోవడంతో గోవిందరావు ఆవేదన చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

రోడ్డుపై బైఠాయించిన మహిళలు..

నవ్య మృతి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం సాయంత్రం నరసన్నపేటలో కళింగకోమట్ల సంఘం ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వెళ్లి వైఎస్సార్ కూడలి వద్దకు వెళ్లి బైఠాయించారు. నవ్యను అత్త, భర్తలే కిరోసిన్ పోసి చంపేశారని ఆరోపించారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు మాత్రం నవ్యది ఆత్మహత్య అని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ హత్యేనని, ఈ దిశగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, గోవిందరావు మృతికి సంతాపంగా నరసన్నపేటలో వ్యాపారులు షాపులన్నీ మూసివేసి బంద్ పాటించారు.

కేసు దర్యాప్తు వేగవంతం చేయాలి..

నవ్య అనుమానాస్పద మృతికి సంబంధించి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ జిల్లా ఎస్పీ రాధికతో ఫోన్‌లో మాట్లాడారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నవయసులోనే నవ్య మృతి చెందడం బాధాకరమని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. పోలీసులతో మాట్లాడి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు.

న్యాయం చేస్తాం

నవ్య మృతి కేసులో ఎటువంటి అనుమానాలు వద్దని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని టెక్కలి డీఎస్పీ బాలచంద్రరెడ్డి తెలిపారు. స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు, వ్యాపారులతో మాట్లాడారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి అనుమానాలు అక్కర్లేదన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌తో ఉచిత న్యాయసేవలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. క్రిమినల్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ సొంతంగా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని వారికి ఇది ఆసరాగా ఉంటుందని పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆగస్టు, సెప్టెంబర్‌లలో డీల్ చేసిన కేసులపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కొమరపు ఆఫీసునాయుడు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్ట అంజనికుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పైడి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

టీహెచ్‌ఆర్ పంపిణీలో ప్రథమ స్థానంలో జిల్లా

శ్రీకాకుళం అర్బన్: స్త్రీ శిశు సంక్షేమశాఖలో నమోదైన గర్భిణులు, బాలింతలు మరింత ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన టేక్ హోం రేషన్ (టీహెచ్‌ఆర్) పంపిణీలో మొదటి విడతలో శ్రీకాకుళం జిల్లాకు రాష్ట్రవ్యాప్తంగా మొదటిస్థానం లభించిందని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ శనివారం తెలిపారు. ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలు తర్వాత స్థానాల్లో నిలిచాయని చెప్పారు. జిల్లాలో రెండు విడతల్లో గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం ఇస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 3,159 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 8558 మంది లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేసినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలో పాత నౌపడ గ్రామానికి చెందిన మామిడి వెంకటరమణ(30) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరమణ టెక్కలిలో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తాను సొంతంగా ల్యాబ్ పెట్టుకుంటానంటూ ఈ నెల 5న కుటుంబ సభ్యులతో ఆర్థిక పరమైన అంశాలపై గొడవపడ్డాడు. మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న యువకుడిని చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వెంకటరమణకు తల్లిదండ్రులు తిప్పరాజు, మహాలక్ష్మి, ఇద్దరు సోదరులు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ కేసు నమోదు చేశారు.

చెల్లిని బాగా చూడటం లేదని బావపై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : చెల్లిని బాగా చూడటం లేదంటూ బావపై బావమరిది దాడి చేసిన ఘటన శ్రీకాకుళం నగరంలో చోటుచేసుకున్నట్లు రెండో పట్టణ ఎస్‌ఐ కె.లక్ష్మి పేర్కొన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం బలివాడ గ్రామానికి చెందిన అలిగి రమణ సీమ్యాన్‌గా ఉంటూ అదే గ్రామానికి చెందిన పెంట రాజారావు కుమార్తె అమరావతిని 13 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి పిల్లలు లేరు. రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో అమరావతి తన కన్నవారింటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీకాకుళంలో తన చెల్లెలు అమరావతి పేరుతో ఉన్న కారును సోదరుడు సాయి తీస్తుండగా.. ఆ కారు తాను కొన్నానని రమణ అడ్డుగా వెళ్లడంతో కాలికి గాయమైంది. చెల్లిని సరిగా చూడటం లేదంటూ సాయి, ఆమె తండ్రి రాజారావు, అమరావతిలు తనపై దాడి చేసినట్లు రమణ పేర్కొనడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

కళాకారుడి మృతికి సంతాపం

పొందూరు: మండలంలో లోలుగు గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు పిసిని కృష్ణమూర్తి(62) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన విజయనగరంలో స్థిరనివాసం కాగా, స్వగ్రామం లోలుగులో అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణమూర్తి భూమిబాగోతం, బుర్రకథలో హాస్యనటుడిగా మంచి గుర్తింపు పొందారు. ఈయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణమూర్తి మృతి పట్ల జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, ఎంపీటీసీ లక్ష్మున్నాయుడు, వైస్ సర్పంచ్ చంద్రరావు, కుమ్మరి శాలివాహన సంఘం డైరెక్టర్ వీరాస్వామి, గ్రామస్తులు సంతాపం తెలిపారు.